## అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రి సీజ్ : డీఎంహెచ్ఓ నాగ నిర్మల

**కంగ్టి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**
మండల కేంద్రంలో అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రిని జిల్లా వైద్యాధికారి నాగనిర్మల సీజ్ చేశారు. బుధవారం ఆమె మండలంలో పలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆర్ఎంపీ డాక్టర్లు పరమితిని మించి వైద్యం అందిస్తున్నారని పేషెంట్‌కు యాంటిబయటిక్ ఇచ్చే అర్హతలు వీరికి ఉండవన్నారు. ప్రతమ చికిత్స సెంటర్‌కు కనీసం పేర్లు పెట్టకుండా చికిత్స నిర్వహిస్తున్నారని, అలాచేయడం సరైన పద్ధతికాదని హెచ్చరించారు. నిర్మల హాస్పిటల్ వైద్యుడు అనుమతులు లేకుండా నాలుగు సంవత్సరాల నుంచి అలోపతి ప్రాక్టీస్ చేస్తున్నారని ఇంతవరకు ఏ అధికారి వీరి ఆసుపత్రికీ తనఖీ చేయలేదా అని అన్నారు. అర్హత లేనివారు అనుమతులు లేకుండా ఆసుపత్రి వైద్యం చేయడం ఏమిటని(నిర్మల పాలిక్లినిక్)కు నోటీసులు జారీచేశారు. మండల పరిదిలోని ప్రతి ఆసుపత్రిని తనఖీ చేసే అధికారం మెడికల్ ఆఫీసర్‌కు ఉంటుందని, నిరంతరం తనఖీలు చేపడతాం అని తెలిపారు. అదేవిధంగా కంగ్టి ప్రాతమిక ఆరోగ్యం కేంద్రం ఇరువై నాలుగు గంటలు పనిచేస్తుందని, వీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. తనఖీలో మెడికల్ ఆఫీసర్ నాగమణి పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## మహిళ కడుపులో ఆరు కిలోల కణతి..

### -ఆపరేషన్ చేసి బయటకు తీసిన వైద్యులు

**ములుగు, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కేశవనగర్ గ్రామానికి చెందిన బొప్ప రాజు ప్రమీల కొద్దిరోజులుగా పొట్ట లావు కావడంతో బాధపడుతూ ఏమీ తినకుండా కాలం గడిపింది. కాలం గడిచిన కొద్దీ అవస్థ ఎక్కువ కావడంతో చికిత్సకు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులకు వెళ్లగా ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బులు లేకపోవడంతో ములుగు మండలం లక్ష్మక్కపల్లి సమీపంలోగల ఆర్‌విఎం ఆసుపత్రికి రావడంతో వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి గత నెల 13న ఆమె కడుపులో 6 కిలోల కణతి గడ్డను గుర్తించి 16వ తేదీన వైద్యులు క్రాంతిరెడ్డి, ప్రసన్న, వంశీకృష్ణ, తేజస్వి బృందం 10 గంటలు శ్రమించి ప్రమీల కడుపులో ఉన్న కణతిని తొలగించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ గోపికృష్ణ, సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలబడుతూ ఉచితంగానే ఎన్నో రకాల ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ సామాజికవేత్త మంచినీళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(తొగుట) :** తొగుట మండలంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి,హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోజులకు మెరుగైన వైద్యం అందించాలని సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ల్యాబ్‌ను పరిశీలించి ఎన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు.ఆయుష్ వైద్యాన్ని మెరుగుపరచాలని ఆయుష్ డాక్టర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం తొగుట మండల పరిధిలోని తుక్కపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో వంద శాతం గ్రౌండింగ్ అయిన ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహాశీల్దార్ శ్రీకాంత్, ఎంపిఓ శ్యామల తదితరులు ఉన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికే భూభారతి

### -అదనపు కలెక్టర్ ఉమాహారతి


దూదగొండలో భూభారతి ఫైల్ వెరిఫిషన్‌ను పరిశీలిస్తున్న ఉమాహారతి

**మనూర్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** రైతుల సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు నారాయణఖేడ్ అదనపు కలెక్టర్ ఉమాహారతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూద గొండ గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ భూభారతిలో 12 గంటల భూమి నమోదు కాకపోవడంతో భూభారతిలో ధరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ ఉమాహారతి క్షేత్రస్థాయిలో సమస్యలను రైతులతో కలిసి పరిశీలించారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తహసీల్దార్ విష్ణుసాగర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనుద్దీన్, మాజీ సర్పంచ్ రాజు, ధనరాజ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## నేడు సుల్తాన్‌పూర్‌లో రూ. 8.76 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

**చౌటకూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో 8.76 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ఈ నెల 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా శంకుస్థాపన చేస్తారన్నారు. చౌటకూరు మండలానికి సంబంధించి 6.20 కోట్లతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, 2.56 కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాల నిర్మాణాలకు మంత్రి శ్రీకారం చుట్టనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి దామోదర్ రాజనర్సింహా శంకుస్థాపన చేసేందుకు హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ సూచించారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### డిఇవో శ్రీనివాస్‌రెడ్డి

**మర్కుక్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** గ్రామీణ క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభచాటాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ ఎస్‌జిఎఫ్ క్రీడోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎంఈవో వెంకటరాములుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని, మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, మానసిక దృఢత్వాన్ని పెంచుతాయని, విద్యార్థులందరూ ప్రతిరోజు ఒక పీరియడ్ ఆటలు ఆడాలని సూచించారు. ఈ క్రీడోత్సవాల ద్వారా క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని ఆరోగ్యకరమైన పోటీ వాతావరణంలో ఈ రెండు రోజులు ఆడాలని విద్యార్థులను కోరారు. ఇదిలా ఉండగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేశంగౌడ్ సహకారంతో బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే క్రీడాకారులకు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మొర్సు కరుణాకర్‌రెడ్డి భోజన వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్కుక్, చేబర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశం, శంకర్‌రెడ్డి, పాములపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతీఫ్‌సైదా, పిఆర్‌టియు అధ్యక్షుడు రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్, టిపిటిఎఫ్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బాలనర్సయ్య, ఎస్‌జిటియు అధ్యక్షుడు ముత్తయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

# నష్టపోయిన పంటల వివరాలను సేకరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్


వరదలకు నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**అల్లాదుర్గం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సంబంధిత శాఖ అధికారులు సేకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో వరదలకు నష్టపోయిన పంటలను, తెగిపోయిన కుంటలు, చెరువులను, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో కల్వర్టులు, రోడ్లు తాత్కాలిక మరమ్మతులు దిశగా పరిషత్ చర్యలు తీసుకోవాలని, శాశ్వత మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు ఉన్నారు.

**పాడైన పంటలను పరిశీలించిన కలెక్టర్...**

**అల్లాదుర్గం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాడైన పంటలను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. బుధవారం అల్లాదుర్గంలోని బట్టికుంట చెరువు కట్ట తెగిపోవడంతో వరద నీరు పొలాల్లోకి చేరుకుని నష్టపోయిన విషయం పాఠకులకు విధితమే. మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో వరదలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. అల్లాదుర్గంలో వరద నీటితో కొట్టుకుపోయిన బిటి రోడ్డును,కుంట మారిన రోడ్డుపై నుంచి కలెక్టర్ నడుచుకుంటూ సమస్యను పరిశీలించారు.రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌ను ఆదేశించారు. త్వరలో చెరువు కట్టకు మరమ్మతులు చేయిస్తామన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నామని, ప్రభుత్వానికి నివేదిక అందచేసి నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. మండలంలో 33 శాతం వరి, పత్తి పంటలు 200 ఎకరాల్లో నష్టపోయినట్లు వ్యవసాయాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంటలు నీటమునగడంతో ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, వ్యవసాయశాఖ ఇంచార్జి ఏడిఏ రాంప్రసాద్, ఏఓ రాజేష్ కుమార్, ఏఈఓ నవీన్‌కుమార్, గడిపెద్దాపూర్ ఏఈఓ విఠల్‌రావు, అల్లాదుర్గం కార్యదర్శి ప్రభాకర్, రైతులు మున్నూరి సత్యనారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

**కాజ్వేలు కల్వర్టులు, రోడ్ల మరమ్మతులకు చర్యలు..**

**టేక్మాల్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** పంట నష్టం అంచనాలు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సాగుతున్నాయని, భారీ వర్షాలు వరదలవల్ల నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. టేక్మాల్ మండలం బోడ్మాట్‌పల్లి గ్రామంలో గుండువాగు వల్ల దెబ్బతిన్న పత్తి పంటను, పొలాలకు వెళ్లే రోడ్డును, అల్లాదుర్గం మండల కేంద్రంలోని బద్దికుంట తెగిపోవడం వల్ల నష్టపోయిన వరి పంటలను, అల్లాదుర్గ మండలం గడి పెద్దాపూర్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను సంబంధిత అగ్రికల్చర్, రెవెన్యూ అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో అపార నష్టం వాటిల్లిందని అధికార యంత్రాంగం వరద నష్టం అంచనాల ముమ్మరంగా సాగుతున్నాయని పంట నష్టపోయిన ప్రతి రైతుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో స్పష్టమైన నివేదికలు రూపొందించి, ప్రభుత్వం దృష్టికి సాధ్యమైనంత త్వరగా తీసుకు వెళ్లేలా కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు.


బిఆర్ఎస్‌లో చేరిన జాగృతి నేతలు

## బిఆర్ఎస్‌లో చేరిన జాగృతి నేతలు

### -పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన కెటిఆర్

**మర్కుక్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్య త్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించిన గంట వ్యవధిలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన జాగృతి నాయకులు బుధవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కెసిఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 200 మంది నేతలు మాజీ ఎమ్మెల్యే రేకకాంతారావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం అయిన ఐఎన్‌టియుసి సింగరేణి కార్మిక సంఘం నాయకులు సుమారు 300 మంది పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఊకంటి ప్రభాకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :**
రామాయంపేట మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని కోమట్‌పల్లి, ఎక్కల్‌దేవనబండ సమీపంలో44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్ల ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం హెడ్ కానిస్టేబుల్ విజయ ప్రభాకర్, పెట్రోల్ కార్ డ్రైవర్ ప్రశాంత్‌తో కలిసి విధుల్లో ఉన్న సమయంలోఉదయం సుమారు 3:56 గంటల సమయంలో అజయ్ అనే వ్యక్తి డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా, సుమారు 40-45 సంవత్సరాల మధ్యలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలవల్ల అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. శవాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్.ఐ బాలరాజు తెలిపారు.

## చిరుత దాడి.. లేగదూడ మృతి

**సిర్గాపూర్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడపల్ గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తోందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామశివారులో చిరుతపులి దాడిలో లేగదూడ మృతి చెందడంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాములు రైతులతో కలిసి పరిశీలించారు. అటుగా ఉన్న చిరుత ఆనవాళ్లను గుర్తించారు. చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడకు పశువైద్యాధికారి డాక్టర్ జెస్సి పోస్టుమార్టం నిర్వహించారు. పొలాల్లో పశువులను ఉంచరాదని ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాములు రైతులకు సూచించారు.

## పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలు

**చౌటకూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** మండలపరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ నలుగురిపై దాడి చేసి గాయపర్చింది. గ్రామానికి చెందిన కుమ్మరి రామమ్మ, గంట దుర్గమ్మ, చాకలి మల్లమ్మ, ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన మో వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిని నలుగురు క్షతగాత్రులను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందచేశారు. మరో నాలుగురోజులపాటు చికిత్సలు అందుకోవాల్సి ఉంటుందని, క్రమంతప్పకుండా ఆసుపత్రికి వచ్చి చికిత్స అందుకోవాలని డాక్టర్ సూచించినట్లు బాధతులు పేర్కొన్నారు.క్షతగాత్రులకు గ్రామ మాజీ సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి తలా ఒక్కరికి వేయి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. నలుగురిపై దాడి చేసిన పిచ్చికుక్కను గ్రామస్థులు దాడి చేసి చంపేశారు.

# యూరియా అందడంలేదని రోడ్డెక్కిన రైతులు

### -భారీగా ట్రాఫిక్ జామ్..ఏడిఏ, తహసీల్దార్ జోక్యంలో శాంతించిన రైతులు

**గజ్వేల్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** సరిపడా యూరియా అందడంలేదని మరోసారి రైతులు రోడ్డెక్కారు. బుధవారం గజ్వేల్‌లో యూరియా కోసం తూప్రాన్ రోడ్డులో పెద్దఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గజ్వేల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాస్తున్నా ఒక్క సంచీ అందడంలేదని నిరసన తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ యూరియాను రాత్రికి రాత్రే బడా రైతులకు అధికారుల అండతో అమ్ముతున్నారని ఆరోపించారు. రైతులను మభ్య పెట్టడం కోసం సంబంధిత వ్యవసాయాధికారులు టోకెన్లు ఇస్తూ యూరియాను ఇవ్వడంలేదని మహిళా రైతులు నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో యూరియా కొరత లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల గోస పెడుతుందని, తిండి లేక ప్రతిరోజు యూరియా కోసం గజ్వేల్ పట్టణానికి రావాల్సి వస్తుందని వాపోయారు. ప్రతిరోజు యూరియా కోసం వస్తున్న రైతులు ధర్నా చేయడంతో అధికారులు యూరియా ఇస్తామని చెప్పి టోకెన్లు ఇచ్చి ఒక్కొక్కరిని రెండుమూడు రోజులు తిప్పుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా రైతులకు చేసిందేమీ లేదన్నారు. రైతులు రోడ్డుపై బైఠాయించిన విషయం తెలుసుకున్న ఏడిఏ బాబునాయక్, స్థానిక తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏఓ నాగరాజులు ధర్నా వద్దకు వచ్చి రైతులను సముదాయించారు. త్వరలో అందరికి అందుబాటులో యూరియా వస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. గజ్వేల్ సిఐ తమ సిబ్బందితో కలిసి ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చి సముదాయించి రోడ్డుపై నుండి పక్కకు పంపారు. ధర్నా చేస్తున్న సమయంలో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


రైతులతో మాట్లాడుతున్న ఏడిఏ బాబునాయక్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

## నష్ట పోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

### బిఆర్ఎస్ నేతల డిమాండ్

కొండపాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : గ్యాస్ లీక్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ నాయకులు రైతు బందు రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, మాజీ సర్పంచులు కిరణ్ కుమార్‌చారి, బచ్చలి మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ నెల 2న కుకునూరుపల్లి మండల పరిధిలోని మంగోల్ గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌజ్‌లో ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయి 60 ఎరకాల్లో రైతులు వరి, పత్తి పంటలు నషనష్టపోయారని అయన అవేదన వ్యక్తం చేశారు. బుదవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులు నష్టపోయిన పంటలను పరిశీలనకు రాగా అయన సైతం అమెతో కలిసి తిరిగి పంటలను పరిశీలించారు. నష్ట పరిహారం రైతులకు త్వరగా అందేలా చర్యలు తీసుకొవాలని అమెను కోరారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడుతూ మంగోల్, మాత్‌పల్లి, మెదనిపూర్ రైతులు పంటలను నష్టపోయారన్నారు. గ్యాస్ లీక్ అయన సమయంలో రైతులు ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. ఎకరానికి రూ॥ 70 వేలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. వాటర్ ప్లాంట్ అధికారులు నిర్లక్ష్యం వల్లనే గ్యాస్ లీక్ అయిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అయన వెంట ఉప సర్పంచ్ బట్టు నరసింహ్మారెడ్డి, రైతులు పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ లీక్‌తో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# రైతులు అధైర్యపడొద్దు.. నష్ట పరిహారం చెల్లిస్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**కొండపాక, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త :** మిషన్ భగీరథ గ్రీడ్ వల్ల పంటలను నష్టపోయామని, ఆదుకోవాలని సిద్దిపేటజిల్లా కలెక్టర్ హైమావతిని రైతులు వేడుకున్నారు.బుధవారం కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామశివారులోఉన్న మిషన్ భగీరథ పంప్ హౌజ్ వద్ద తాగునీటి శుద్ధి కోసం ఉపయోగిస్తున్న క్లోరిన్ గ్యాస్ ప్రమాదవశాత్తు ఈనెల 2న లీక్ అయి 20 ఎకరాల వరి, పత్తి పంటలకు నష్టం జరిగింది. ఈ విషయమై మిషన్ భగీరథ డిఈ దృష్టికి తీసుకెళ్లారు. అది జిల్లా కలెక్టర్ దృష్టికిరాగా ఆమె నష్టపోయిన పంటలను పరిశీలించారు.అనంతరం గ్యాస్ లీకైన ప్రదేశానికి వెళ్లి ఎలా లీక్ అయిందో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన పంటల వివరాలను ఇద్దరు శాస్త్రవేత్తలతో కూడిన బృందం వివరాలను సేకరిస్తుందని తెలిపారు. వారు ఇచ్చే నివేదిక ప్రకారం రైతలకు పంట నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గ్యాస్ లీక్ అయిన సమయంలో పొలాల్లో ఉన్న రైతులకు కళ్లల్లో తీవ్ర ఇబ్బందులు కలగడంతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడ్డామని కలెక్టర్‌కు వివరించారు. 14 మంది రైతులు 20 ఎకరాల్లో పంటలు నష్టపోయామన్నారు. ఆమె వెంట డిఎఒ. మిషన్ భగీరథ అధికారులు, ఎంపిడిఒ రాంప్రసాద్, తహసీల్దార్ సుజాత, ఎఒ తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ లీక్‌తో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## బైకును ఢీకొన్న బొలెరో.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**శివ్వంపేట, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త) :** బైకును వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొన్న ఘటన నర్సాపూర్ తూప్రాన్ ప్రధాన రహదారిపై పిఏసిఎస్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు, శీను, అచ్చంపేటకు చెందిన గోవర్ధన్ ముగ్గురు కలిసి శివ్వంపేట వెళ్లి తిరిగి పిఏసిఎస్ కార్యాలయం వద్దకు శ్రీను భార్య తిరుపతమ్మ, కూతురు శిల్ప క్యూలో నిలబడి యూరియా తీసుకుంటున్నారు. ఆంజనేయులు, శీను, గోవర్ధన్‌కూడా యూరియా కోసం క్యూలో నిలబడేందుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు బైకును వెనుక నుండి బొలెరో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## యువతి అదృశ్యం

**వర్గల్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** యువతి అదృశ్యమైన సంఘటన వర్గల్ మండలకేంద్రంలో చోటుచేసుకుంది.గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్‌కు చెందిన పసుల మానస(19) ఈనెల 2వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుండి వెళ్ళిపోయింది. మానస రాత్రి వరకు ఇంటికి రాకపోగా ఆమె ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మానస తండ్రి కృష్ణ గౌరారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

**జహీరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని అల్గోల్ గ్రామం అల్లానా కర్మాగారం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న తరుణంలో మండల పరిధిలోని సత్వార్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఖయ్యూం, ఫకీర్ అయూబ్ స్కూటీపై అనుమానాస్పదంగా వెళుతుండటంతో అనుమానం వచ్చి పరిశీలించగా స్కూటీలో 140 గ్రాముల ఎండు గంజాయిని, డియో స్కూటీని, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జహీరాబాద్ ఎక్సైజ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐలు హనుమంతు, అనుదీప్‌లు వివరించారు. దాడిలో కానిస్టేబుళ్లు అరుణజ్యోతి, అంజిరెడ్డి, రాజేష్‌లు పాల్గొన్నారు.


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

## గణేష్ మండపాల వద్ద మహిళల నృత్యాలు

**సదాశివపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

సదాశివపేటలోని శ్రీరామకళామందిరం దగ్గరలో జైభవాని యూత్ వారు గణనాథుని ఏర్పాటుచేశారు. వినాయక చవితి నాడు ఏర్పాటు చేసిన ఈ గణనాథునికి 11రోజులపాటు కాలనీవాసులు అందరూ కలిసి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చిన్న, పెద్ద అని తేడాలేకుండా అందరూ కలిసి ఆనందంతో ఆటలు ఆడుతూ విభిన్న రీతిలో నాట్యం చేస్తూ ఆ గణనాథుని కొలుస్తున్నారు.

## అల్లాదుర్గంలో గంగమ్మ ఒడికి గణనాథుడు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన అల్లాదుర్గంలో హనుమాన్ యూత్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమర్జనానికి భజనలు చేస్తూ గంగమ్మ ఒడికి తరలించారు. అందంగా అలంకరించిన వాహనంలో వినాయకుడిని ప్రతిష్ఠించుకుని యువకుల కేరింతల మధ్య ఉట్టి కార్యక్రమం నిర్వహించి శోభాయాత్రగా లంబోదరుడిని తరలించి నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా విఘ్నేశ్వరుడి చేతిలో లడ్డూ వేలం వేశారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా వక్రతుండుడిని శోభాయాత్రగా ఊరేగిస్తూ చెరువు వద్దకు తరలించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి సదానందం, నాయకులు, భక్తులు కాల వేణు, ఊదునూరి సంతోష్‌కుమార్, నరేందర్, జంగం శ్రీకాంత్, నవదీప్, బోయిని బేతయ్య, అరిగే నర్సింలు, మోహన్, ఎం.నాగరాజు, శ్రీకాంత్, రాందాస్, బత్తిని చింటూ, మద్దూరి వెంకట్, గోవర్ధన్, శ్రీనివాస్, మురడి దుర్గేష్, వై.శ్రీకాంత్, జంగం సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ క్రీడలు..

**కంగ్టి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

కంగ్టి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఎంపిడివో సత్తయ్య, ఎంఈఓ రహీముద్దీన్ మొదటగా జ్యోతిని వెలిగించి, తదనంతరం వందే మాతరం గేయాన్ని స్వీకరించి, విద్యార్థులతో క్రీడాప్రతిజ్ఞ చేయించి, క్రీడలను ప్రారంభించారు. తొలుత కంగ్టి కస్తూర్బా విద్యాలయం బాలికలు, తడకల్ హైస్కూల్ బాలికల మధ్య పోటీ మొదలైంది. హోరాహోరీగా పోటీపడ్డారు. ఈకార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ కుల్కర్ణి, యశ్వంత్, కిపాయత్అలీ, సంఘ్‌శెట్టి, విట్టల్‌రెడ్డి, శంసోద్దీన్, అంబాజీలు పాల్గొన్నారు.

## డిసిసిబిలో అన్ని వర్గాలకు రుణ సౌకర్యం

**-మిన్పూర్‌లో అవగాహన సదస్సులో మేనేజర్ జాదవ్‌కిషన్**



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ కిషన్

**పాపన్నపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

రైతులతోపాటు అన్నివర్గాలవారికి వివిధరకాల రుణసౌకర్యం కల్పిస్తున్నామని పాపన్నపేట డిసిసిబి బ్యాంక్ మేనేజర్ జాదవ్‌కిషన్ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో డిసిసిబి బ్యాంక్ కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులనుండి తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే కలిగే లాభాలపై వివరించారు. అదేవిధంగా మహిళాసంఘాలకు రూ.20లక్షల రుణాలు అందజేసినట్టు వెల్లడించారు. బంగారు ఆభరణాలపై ఇతరబ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకే ఋణం అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ బ్యాంకులో రైతులకు అగ్రికల్చర్ లోన్లతోపాటు విద్యార్థులకు స్టడీస్, విదేశీవిద్య, వాహన ఋణాలు, అందిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకులో లాకర్‌సౌకర్యం కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో మేనేజర్ కిషన్‌తోపాటు బ్యాంకు సిబ్బంది నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం కమల హైస్కూల్ ఆధ్వర్యంలో ఆగస్టు 21 నుంచి 24వ తారీఖు వరకు జరిగిన సిబిఎస్ఈ తైక్వాండో సౌత్ జోన్-1 టోర్నమెంట్ పోటీల్లో పటాన్‌చెరు నియోజకవర్గంలోని బిహెచ్ఈఎల్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థినులు ఎం.హ్రుతిక, ఎం.హున్నేశాలు పాల్గొని రజిత పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో సెప్టెంబరు 3నుంచి 7వ తేదీవరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పోటీలు నిర్వహిస్తున్నందున ప్రతిభచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించి పోటీ పడేందుకు సాగనంపారు. తమపాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ చెబోలు ఉమా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణిలు అన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం

**నర్సాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై బి.లింగం హాజరయ్యి వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ మాతకు గణనాథునికి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బోర్లేపు శ్రీనివాస్‌గుప్తా, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్త, నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్‌గుప్తా, ప్రధానకార్యదర్శి జొన్నవాడ మల్లేశంగుప్తా, కోశాధికారి హరీష్‌గుప్తా, విట్టల్‌గుప్తా, నోముల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

## 5న ఉచిత మెగా వైద్యశిబిరం

**వట్‌పల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

వట్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం మిలాద్-ఉన్-నబి పురస్కరించుకొని ఆమెదా హాస్పిటల్ పటాన్‌చెరు వారు ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వట్‌పల్లి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈశిబిరం నిర్వహించబడుతుందన్నారు. వట్‌పల్లి దర్గా షరీఫ్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మల్లారెడ్డిగూడలో గణనాథుని నిమజ్జనం

**షాబాద్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

షాబాద్ మండలం మల్లారెడ్డి గూడ గ్రామంలో బుధవారం గణనాథునికి ఘనంగా పూజలు జరిపి నిమజ్జనం చేశారు. ఉదయం నుండి స్వామికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించి భక్తి కీర్తనలు పాడుతూ గంగమ్మ ఒడిలోకి చేర్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**-ఒక్కపూట పనివిధానం అమలు చెయ్యాలి**
**-సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం**



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు, తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

మున్సిపల్ కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం మాట్లాడుతూ ఈఎస్ఐలో నామిని పేర్లు చేర్చకపోవడంతో ఎవరికైనా ఆరోగ్యసమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వెంటనే నామినీ పేర్లుచేర్చాలని కోరారు. పనిచేయాలని అధికారులు చెప్తున్నా పనిముట్లు గడ్డపార, కత్తి, కొడవలి, గొడ్డలి ఇవ్వడంలేదని పని ఎలాచేస్తారని ప్రశ్నించారు. కార్మికులు అత్యవసర సమయంలో ఎప్పుడుపిలిస్తే అప్పుడువచ్చి వార్డులలో పని చేస్తున్నారని వారికి వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. రెండు పూటాలా పని చేయడం అంటే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మెదక్‌లో ఒక్కపూట నిర్వహిస్తున్నట్లుగా నర్సాపూర్‌లో కూడా ఒకేపూట పని చేయించాలని డిమాండ్ చేశారు. అందరు కార్మికుల లాగానే వాటర్‌సప్లై, ఎలక్ట్రిషియన్ కార్మికులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని అన్నారు. సంవత్సరంలో ఇవ్వాల్సిన సబ్బులు, బెల్లం, నూనె ఒకేసారి ఇవ్వకుండా 3 నెలలకు ఒకసారి ఇవ్వడంతో కార్మికులు వాడుకోవడానికి సులువుగా ఉంటుందని గుర్తుచేశారు. డ్రైవర్స్‌కు కార్యాలయం నుండే లైసెన్స్ ఇప్పించాలని కమిషనర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కదారి నాగరాజు, మున్సిపల్ కార్మికులు పుష్ప, రాములు, శంకరయ్య, అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## టేక్మాల్‌లో 100 కోట్లతో అభివృద్ధి పనులు

**-ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న పల్లెలు**
**-మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్**



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**టేక్మాల్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేపట్టిన కొద్ది కాలంలోనే పల్లెలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. బుధవారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలన్నీ అభివృద్ధి లేక కుంటుపడ్డాయని అందోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ ఇచ్చినహామీలను నిలబెట్టుకునేందుకుగాను సుమారు రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను కొనసాగిస్తుందని ఆయన అన్నారు. మారుమూల గిరిజన తండాలకు సైతం బిటిరోడ్లను నిర్మించారన్నారు. ఎన్నికలముందు ఇచ్చినహామీలన్నీ నెరవేరుస్తూ సంక్షేమఫలాలను అర్హులందరికీ అందిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఇందులో మండల నాయకులు మాన్‌కిషన్, మల్లారెడ్డి, సత్యనారాయణ, పాపయ్య, భూమిరెడ్డి, అవినాష్, మహేష్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సేవాలాల్, నర్సింహారెడ్డి, రవిబాబు, సంగప్పలు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించడానికి కృషి చేయాలి

**-డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్నీన్**

**నర్సాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని వాటిని సాధించడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్నీన్ అన్నారు. బుధవారం నర్సాపూర్, కౌడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ మార్గదర్శకత్వంలో వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్నీన్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో అర్హత కమిటీ కోఆర్డినేటర్ హేమంత్ కుమార్, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఆదెప్ప, అధ్యాపక సభ్యులు కె.రమేష్, మొహమ్మద్ ఖాజా, ఆరిఫ్, డాక్టర్ బి.రవికుమార్, ఈ.శ్రీనివాస్ డాక్టర్ బి.సురేష్‌కుమార్, ఎస్.మహేందర్‌రెడ్డి, ఎస్.రాజు, జానకి, బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సొంతనిధులతో మాతృదేవోభవ కానుకల పంపిణీ

**-నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ టిపిసిసి కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి తన సొంతనిధులతో గర్భిణీస్త్రీలకు మాతృదేవోభవ కిట్లను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన వెల్దుర్తి, రామాయపల్లి, బండపోసానిపల్లి, కుక్కునూరు, మానేపల్లి గ్రామాల్లో బుధవారం అంగన్‌వాడీ సెంటర్లలో నమోదయి ఉన్న గర్భిణీస్త్రీలకు మాతృదేవోభవ కానుకల కింద ప్రోటీన్ పౌడర్, ఐరన్ సిరప్‌లను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్నిమండల గ్రామాల్లో గర్భిణీ స్త్రీలకు కావలసిన పౌష్టిక ఆహారాన్ని, మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి సుధాకర్ గౌడ్, నాయకులు శేఖర్‌గౌడ్, మల్లేశం, సుధీర్‌రెడ్డి, కిష్టాగౌడ్, కృష్ణ, మంగళపర్తి మాజీసర్పంచ్ రామకృష్ణారావు వెల్దుర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశంచారి, ముక్తాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విఘ్నేశ్వరుడిని బుధవారం కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఎల్ఐజి బ్రిలియంట్ స్కూల్ సమీపంలోని లంబోదరులను దర్శించుకుని పూజలుచేశారు.

## మోసానికి దారితీసే అత్యాశ

**-అదనపు ఎస్పీ మహేందర్**

**పాపన్నపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

అత్యాశకు పోయి ఆన్ లైన్ మోసాల బారిన పడవద్దని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ క్రైమ్ డిఎస్పి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళాభద్రత, సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చరవాణిలో గుర్తుతెలియని లింకులు ఓపెన్ చేయడం సరికాదన్నారు. యువత మంచిమార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిపై షీటీం ఉక్కుపాదం మోపుతుందని తెలిపారు. అంతేకాకుండా అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారి కోసం షీటీంకు సంబంధించిన ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. ఇటీవల కొంతమంది మహిళలను వేధిస్తున్న వారిని షీటీం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కటకటాలకు పంపారని గుర్తుచేశారు. ఆకతాయిల ఆటకట్టిస్తుందని అన్నారు. అనవసరమైన కేసుల్లో ఇరుక్కొని జీవితాలు నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే యువత డ్రగ్స్, సిగరెట్, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిఎస్పీ సుభాష్‌చంద్రబోస్, షీటీం ఎఎస్ఐ వెంకటయ్య, ప్రమీల, డ్రగ్స్ నిర్మూలన అధికారి సతీష్, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన మాజీ మున్సిపల్ చైర్మన్



గణనాథుడికి ప్రత్యేకపూజలుచేసిన దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డ్ హనుమంతపూర్‌లో మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి బుధవారం నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేవారు. అనంతరం నిర్వాహకుల నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్‌తో పాటు గ్రామనాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

**-ఉపాధ్యాయులను సన్మానించిన బిసి ఉద్యోగుల సంఘం నాయకులు**



ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న బిసి ఉద్యోగుల సంఘం నాయకులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

విద్యాశాఖ ప్రమోషన్లలో భాగంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను బిసి ఉద్యోగుల సంఘం నర్సాపూర్ డివిజన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు పి.కొండల్, కె.విష్ణువర్ధన్‌లను శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధ్యాయుల ప్రమోషన్లలో కూడా బిసి రిజర్వేషన్లు అమలుచేసేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం నర్సాపూర్ డివిజన్ కమిటీ బాధ్యులు కె.శేషాచారి, ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, కృష్ణ, సంతోష్, వెంకటకృష్ణ, కె.రవికుమార్, శ్రీనివాస్, పండరి, భవాని, ప్రసాద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే డబ్లింగ్ లైన్‌తో ప్రజలకు రవాణా సౌకర్యవంతం

**-అక్కన్నపేటలో రైల్వే విస్తరణ పనుల పరిశీలనలో మెదక్ ఆర్డీవో రమాదేవి**



అక్కన్నపేటలో రైల్వే డబ్లింగ్ లైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

రైల్వే డబ్లింగ్ లైన్‌తో ప్రజలకు రవాణా మరింత సౌకర్యవంతంగా మారుతుందని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. బుధవారం ముద్కేడ్-మేడ్చల్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ పరిధిలో భూసేకరణ పనులను రైల్వే ఇంజనీర్‌తో కలిసి పరిశీలించారు. పరిశీలనలో అధికారులు స్థానిక రెవెన్యూ సిబ్బందిని భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్ విస్తరణతో రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని, రాబోయే కాలంలో ప్రజలకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు సాఫీగా ముందుకు సాగడానికి అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం అన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిష్కారాలు అందిస్తామని తెలిపారు. రైల్వే ఇంజనీర్ మాట్లాడుతూ డబ్లింగ్ లైన్ పూర్తయితే రైల్వే రవాణా సమయం తగ్గుతుందని, సరుకు రవాణా, ప్రయాణికుల రవాణా రెండింటికీ ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో రామాయంపేట తహసీల్దార్ రజనికుమారి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కవిత వెనుక కాంగ్రెస్, బిజెపి కుట్ర

**-హరీష్‌రావుపై కవితచేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం**
**-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై కల్వకుంట్ల కవితచేసిన అనుచితవ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత రాజకీయంగా ఎదుగుదల కోసమే హరీష్‌రావు, సంతోష్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కవితకు మద్దతు ఇస్తున్నాయని, కెసిఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టడం కోసమే కాంగ్రెస్, బిజెపి నాయకులు చూస్తున్నారన్నారు. కెసిఆర్ అధికారంలో లేకున్నా బిఆర్‌ఎస్ పార్టీపై నరేంద్రమోడీ, రేవంత్‌రెడ్డి ఎన్నికుట్రలుచేసినా కెసిఆర్ విజన్‌ను, ఆయన ఆలోచనలు ఎవరూ అందుకోలేరన్నారు. ప్రధాని మోడీ చేస్తున్న మేక్ ఇన్ ఇండియా అంటే ఎరువులను, ఇతరవస్తువులను చైనానుండి దిగుమతి చేసుకోవడమేనా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కవితమ్మకు వెనుకనుండి సపోర్టుచేస్తూ కవితను తెరమీదకు తీసుకువస్తూ కెసిఆర్ కుటుంబాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నరేంద్రమోడీ, రేవంత్‌రెడ్డి రాజకీయ ఎత్తుగడల్లో కవిత ట్రాప్ అయ్యిందని, కవిత పార్టీని వీడినా బిఆర్‌ఎస్‌కు నష్టంలేదన్నారు. తెలంగాణరాష్ట్ర ప్రజలు కెసిఆర్‌ను కోరుకుంటున్నారని, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికలుపెట్టినా 110సీట్లు బిఆర్‌ఎస్‌కు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి, ఎఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పంగ మల్లేశం, బొల్లారం ఎల్లయ్య, ఊడెం కృష్ణారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యూత్ అధ్యక్షుడు గడియారం స్వామిచారి, మర్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నూనె కుమార్‌యాదవ్, రాష్ట్రనాయకులు ఖాజా విరాసత్‌అలీ, మాజీ కౌన్సిలర్లు బబ్బూరి రజితగౌడ్, బాలమణి, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, పంబాల అర్చన శివకుమార్, బొగ్గుల చందు, ఆంజనేయులు, ఉమర్, సంతోష్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అహ్మద్, సంతోష్, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థికవ్యవస్థ పటిష్టం

**-గ్రామీణుల్లో ఆర్థిక నైపుణ్యత లక్ష్యంగా ఆర్‌బిఐ చర్యలు**
**-ఆర్‌బిఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్**



సదస్సులో బ్యాంక్‌సిబ్బందితో మాట్లాడుతున్న చిన్మయ్‌కుమార్

**వర్గల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టం కానుండగా, గ్రామీణుల్లో ఆర్థికనైపుణ్యత లక్ష్యంగా ఆర్‌బిఐ చర్యలు చేపట్టినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వర్గల్ మండలం గౌరారంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు వినియోగదారులు, మహిళాసంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహనసదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థికనైపుణ్యతతో గ్రామీణమహిళలు సమర్థవంతంగా తమ ఆర్థికభవిష్యత్తును నిర్మించుకోగలుగుతారని స్పష్టంచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్‌బిఐ తగిననిబంధనలు రూపొందించి వినియోగదారుల లక్ష్యంగా చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకురుణాలు, ఆర్థిక ఉత్పత్తులు, పొదుపు, పెట్టుబడులు, ఆర్థికరక్షణ, బీమా, పెన్షన్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణుల్లో పొదుపు సంస్కృతిపై విస్తృత చైతన్యం చేస్తూ ఆసొమ్ముకు ముప్పువాటిల్లకుండా దృష్టిపెడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అనవసరలింకులు ఓపెన్ చేయకుండా, ఓటిపిలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పకుండా నేరుగా బ్యాంకులను సంప్రతిస్తే ఎలాంటిసమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఖాతాదారులు తమ అకౌంట్లకు కెవైసి చేయించుకోవడంతోపాటు చైతన్యంతో డిజిటల్ లావాదేవీలు చేపట్టాలని, బ్యాంకులలో వినియోగంలో లేని ఖాతాలను రద్దుచేసుకోని పక్షంలో ఆఖాతాలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా బ్యాంకర్లు సమస్యలు సృష్టించి ఇబ్బందులు కలిగిస్తే అందుబాటులో ఉన్న ఫిర్యాదు బాక్సులో ఉత్తరం ముక్క వేయాలని, సమస్య తీవ్రతను బట్టి ఆర్‌బిఐ అంబుడ్స్‌మెన్‌ను కూడా కలువచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోమతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్‌మేనేజర్ ఉదయ్‌కిరణ్, స్థానిక బ్రాంచ్‌మేనేజర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు నిరసనగా ధర్నా

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు, మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాలతో వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం మండల బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్‌ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, మండల మాజీ జడ్పిటిసి కోట్ల మహిపాల్ మాట్లాడుతూ...తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి నదీజలాలను ఆంధ్రకు తరలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద కుట్రచేస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడో ఒకచోట కుంగిపోతే దాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో సరిచేయాల్సిందిపోయి రాజకీయం చేస్తున్నారని అన్నారు. యూరియాకోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాష్ట్రప్రభుత్వం నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరిస్తుందని, హామీల అమలులో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు, మాజీసర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, ఆయాగ్రామాల బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## గ్రామాలకు ఐమాక్స్ లైట్లు

**హర్షం వ్యక్తం చేసిన బిజెపి నాయకులు**

**కేశంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**

గ్రామాలలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణకు కేశంపేటమండల బిజెపి నాయకులు అభినందనలు తెలిపారు. కేశంపేట మండలపరిధిలోని సంతాపూర్ కొండారెడ్డిపల్లి గ్రామాలకు ఐమాక్స్‌లైట్లు రావడంతో హర్షం వ్యక్తంచేస్తూ బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, బిజెపి యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి కాణం ఉదయకుమార్ గౌడ్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐమాక్స్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు నిధులను మంజూరుచేసిన ఎంపి డికె అరుణకు బిజెపి నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

### ఎబివిపి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎబివిపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గజ్వేల్ శాఖ కార్యకర్తలు బుధవారం సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎబివిపి జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ ఎన్నికల ముందు పెండింగ్‌లో ఉన్న రూ. 8200 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 21 నెలలు గడుస్తున్నా విడుదల చేయలేదన్నారు. ఆరు సంవత్సరాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లలో, కెజిబివిలు, గురుకులాలు, పాఠశాలల్లో నిత్యం ఫుడ్‌పాయిజన్ ఘటనలతో ఇప్పటికే 106 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. విద్యా వ్యవస్థను పూర్తిగా పటిష్టంగా రూపుదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్, నగర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్, కళాశాల కార్యదర్శులు గురు, సుజిత్, కౌశిక్, అభిచరణ్, రాకేష్, సంధ్య, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

### అక్షరాస్యతతోనే ఆర్థిక వ్యవస్థ పటిష్టం

**రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్**



చెక్కును అందిస్తున్న చిన్మయ్‌కుమార్, బ్యాంకు అధికారులు

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఆర్థిక అక్షరాస్యతతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టం అవుతుందని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ చిన్మయ్‌కుమార్ అన్నారు. నారాయణరావుపేటలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం బ్యాంకు వినియోగదారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణుల్లో ఆర్థిక నైపుణ్యత లక్ష్యంగా ఆర్‌బిఐ చర్యలు చేపట్టిందన్నారు. ఆర్థిక నైపుణ్యతతో గ్రామీణ మహిళలు సమర్థవంతంగా తమ ఆర్థిక భవిష్యత్‌ను నిర్మించుకోగలుగుతారని తెలిపారు. బ్యాంకు రుణాలు, ఆర్థిక ఉత్పత్తులు,పొదుపు పెట్టుబడులు, ఆర్థిక రక్షణ, బీమా, పెన్షన్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణుల్లో పొదుపు సంస్కృతిపై విస్తృత చైతన్యం చేస్తూ ఆ సొమ్ముకు ముప్పు వాటిల్లకుండా దృష్టి పెడుతున్నట్లు తెలపారు. బ్యాంకర్లు సమస్యలు సృష్టించి ఇబ్బందులకు కలిగిస్తే అందుబాటులో ఉన్న ఫిర్యాదు బాక్సులో ఉత్తరం ముక్క వేయాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎం.సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోమతి, యూబిఐ డిజిఎం అరవింద్, యూబిఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు, బ్రాంచ్ మేనేజర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ**



వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సూచించారు. జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. గత ఈత గాళ్లను, అందుబాటులో ఉంచడంతో పాటు లైటింగ్, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. చెరువు వద్ద నిమజ్జనం చేయడానికి క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, కలీం, పయ్యావుల ఎల్లం, ముద్దం లక్ష్మీ, అజ్మత్, రషద్, రజిని, సన తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా రాజు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** యువజన కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా కాయితి రాజును నియమించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో గజ్వేల్ పట్టణ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, నాయకులు మహిపాల్‌రెడ్డి,గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి, మహ్మద్ ఫారూక్ జానీలకు కృతజ్ఞతలు తెలిపారు.

### రెండు రోజులు వైన్స్‌లు, బార్లు బంద్

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త :** వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 5వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 7వ తేదీ వరకు ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా వైన్స్‌లు, బార్లు, కల్లు దుకాణాలు మూసి వేయడం జరుగుతుందని ఎక్సైజ్ సిఐ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశాల మేరకు రెండు రోజులపాటు బారు , వైన్స్‌లు, కల్లు దుకాణాలు మూసివేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

### పారిశుధ్యం లోపించకుండా చూడాలి : ఎంపిడివో

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో దామోదర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం చిన్నశంకరంపేటలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. అంతకు ముందు ఖాజాపూర్‌లో డ్రై డే కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. వర్షాలు కురవడంతో పరిసర ప్రాంతాల్లో నిలిచిన నిటిని తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రాజ్ కుమార్; ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

## సిఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి చేయనప్పుడు సీబీఐ అంటే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఎందుకు భయపడుతున్నారని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు ప్రశ్నించారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో బుధవారం రూ.28 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిలో మాజీ సిఎం, మాజీ మంత్రి ఇద్దరు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిజరగడంతోనే కెసిఆర్, హరీష్‌రావులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత స్వయం చెప్పారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి సిఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు చేస్తున్నారని త్వరలోనే బిఆర్ఎస్ దుకాణం క్లోజ్ అవుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిపై అర్థం,పర్థం లేకుండా విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌తోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సాకి అనంద్, పయ్యావుల ఎల్లం, పూజల గోపికృష్ణ, ముద్దం లక్ష్మీ, అలకుంట మహేందర్, కలీం, గయాజుద్దీన్, మార్క పద్మ, అజ్మత్, రషత్, రాకేష్, రజిని, పవన్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ తదితరులు

## పాలకుల నిర్లక్ష్యంతో నలిగిపోతున్న ముదిరాజ్‌లు

**ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి**



మాట్లాడుతున్న జంగిటి శ్రీనివాస్

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** పాలకుల నిర్లక్ష్యం వల్ల ముదిరాజ్‌లు నలిగిపోతున్నారని చట్టపరంగా న్యాయంగా ప్రభుత్వ జివోల ప్రకారం అందాల్సిన ఫలాలు అందకుండా పాలకులు అడ్డుపడుతున్నారని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. ఖాజీపూర్ ముదిరాజ్‌లకు చేపల సొసైటీ ఏర్పడిన సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, ముదిరాజ్ రాష్ట్ర యువత అధ్యక్షులు అడిగే ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడికాయల వెంకటేషం, మీడియా జిల్లా కన్వీనర్ పుప్పాల బాలేష్‌లను చిన్నకోడూరులో బుధవారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారిన పాలకుల తత్వం మారడం లేదని ఏ పాలకుడైన ముదిరాజ్‌లకు చేసిందేమి లేదన్నారు. ఖాజీపూర్ సొసైటీ ఏర్పాటు కోసం ఎన్నో అవంతరాలను దాటాల్సి వచ్చిందని చివరికి న్యాయస్థానాన్ని అశ్రయిస్తే తప్ప న్యాయం జరగలేదన్నారు. పాలకులకు ముదిరాజ్‌లను తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ముదిరాజ్‌లను బిసి డినుంచి బిసి ఏలోకి మారుస్తామని చేపిన సిఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. గత బిఆర్ఎస్ సర్కారు హయాంలో మత్స్యకార్మికులకు ఉచితంగా చేపపిల్లలు, వాహనాలను పంపిణీచేసిందని కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఖాజీపూర్ సొసైటీ ఏర్పాటుకు సహకరించిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులకు ముదిరాజ్ జెఏసి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, బాలనర్సు, రమేష్, గణేష్, సత్యనారాయణ, బైరయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



భూ సేకరణ నిర్వహిస్తున్న ఆర్డీవో రమాదేవి

### భూ సేకరణ పనులు పరిశీలన

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** మండల పరిధి ఖాజాపూర్‌లో బుధవారం ఆర్డీవో రమాదేవి రైలు మార్గం కోసం భూ సేకరణ పనులను పరిశీలించారు. మెడ్చల్ నుండి కామారెడ్డి వరకు రైలుమార్గాన్ని విస్తరించనున్నందున ఈ పనులను పరిశీలించినట్లు తెలిపారు. భూ సేకరణ పూర్తయిన వెంటనే ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామన్నారు. రైలు మార్గాన్ని విస్తరిస్తే ప్రయాణికుల సంఖ్య పెరిగి రైల్వేకు ఆదాయం వస్తుందని, ప్రతి రోజూ మండలంలో వందల మంది విద్యార్థులు,ప్రయాణికులు హైదరబాద్, కామారెడ్డి, నిజామాబాద్‌కు వెళ్తుంటారు. ఒక రైలు వచ్చినప్పుడు ఇంకో రైలును పంపడానికి క్రాసింగ్ పెట్టడం వల్ల ప్రయాణికుల సమయం వృధా అవుతుందని, రెండు మార్గాలుంటే రైళ్ల సంఖ్య కూడ పెరుగుతుందన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మాలతి, రైల్వే అధికారులున్నారు.

### భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** మండల పరిధి ఖాజాపూర్ గ్రామానికి చెందిన శంకరమ్మకు చెందిన భూమి సమస్యను అధికారులు భూ భారతిలో పరిష్కరించారు. గ్రామానికి చెందిన శంకరమ్మకు గ్రామ శివారులో తొమ్మిది గుంటల వ్యవసాయ భూమి ఉంది. ధరణి పోర్టల్ వచ్చిన నాటి నుండి ఆ భూమి ఇతరుల పేరుపై పట్టా రావడంతో ఎన్ని సార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ప్రభుత్వం గ్రామంలో భూ భారతి సదస్సు నిర్వహించగా దరఖాస్తు చేసుకుంది. ఆర్ఐ రాజు గ్రామంలో సర్వే నిర్వహించి తహసీల్దార్ మాలతికి నివేదికను సమర్పించారు. ఈసందర్భంగా బుధవారం శంకరమ్మకు పట్టాకాగితాలను అందించారు. సమస్య పరిష్కారం కావడంతో అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఖాజాపూర్‌లో పట్టా పత్రాలను అందిస్తున్న ఆర్ఐ రాజు



పిహెచ్‌సిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

### గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలి

**జిల్లా వైద్యాధికారి శ్రీరామ్**

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** గ్రామాల్లో ఫివర్ సర్వేను నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. బుధవారం చిన్న శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల ప్రభలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రి భవనంలోకి వర్షపు నీరు రావడంతో వెంటనే మరమ్మతులు చేయించాలని వైద్యాధికారి సాయిసింధూకు సూచించారు. జ్వరంతో బాధపడుతున్నవారి రక్త నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిచాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ అధికారి రవి ప్రసాద్, సీహెచ్‌వో యాదగిరి, వైద్యురాలు హారిక, బుజ్జిలు ఉన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**మునిపల్లి, సెప్టెంబరు 3(ప్రభాతవార్త):** మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకోల్ ప్లాజవద్ద అక్రమంగా తరలిస్తున్న 300క్వింటాల రేషన్ బియ్యాన్ని మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం బుధవారం సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేపట్టగా విజయవాడ నుండి గుజరాత్ వెళ్తున్న లారీ(కేఏ 56 3213)ని తనిఖీచేయగా 300 క్వింటాళ్ల అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ లారీ



## కాంగ్రెస్ సర్కార్‌తోనే భవన నిర్మాణ రంగ కార్మికులకు న్యాయం

**బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం**



సిఎం, కార్మిక మంత్రి. బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుని ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలు భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ముందుకు వచ్చారని బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగాల కార్మికులకు చెందిన పలు సమస్యలను పరిష్కరిస్తూ నిర్ణయంతీసుకోవడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి,కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంటస్వామితో పాటు బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిఎన్ఆర్‌కెస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారుతోనే భవన నిర్మాణ రంగాల కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు.గత ప్రభుత్వం భవన నిర్మాణరంగాల కార్మికులకు అనేక హామీలు ఇచ్చింది కానీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. గతంలో కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.6 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించిందని నేటి కాంగ్రెస్ సర్కారు రూ.10 లక్షలకు పెంచిందన్నారు. అలాగే సాధారణ మరణం జరిగితే రూ,1 లక్షకు బదులు రూ.2 లక్షలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ.5 లక్షలు అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.అలాగే భవన నిర్మాణ రంగాల కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యంతో పాటు పెన్షన్,ఇల్లు లేని కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చేలా, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు వచ్చేలా సిఎం రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, లేబర్ కమిషనర్ గంగాధర్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌వెంకటస్వామికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేసిన బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరపల్లి చంద్రంలకు భవన నిర్మాణ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పర్శా రాములు, ప్రశాంత్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### కొమురవెల్లి దేవాలయ ఈవోగా వెంకటేష్

**కొమురవెల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ఈవోగా టి.వెంకటేష్ బుధవారం దేవాలయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన అన్నపూర్ణ పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో టి.వెంకటేష్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. గతంలో టి.వెంకటేష్ రెండేళ్లపాటు స్వామి వారి దేవాలయంలో ఈవోగా పనిచేశారు. కార్యక్రమంలో ఆలయ ఎఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, అకౌంటెంట్ శంకర్, మధుకర్, అర్చకులు, వేద పండితులు,ఒగ్గు పూజారులు,నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

### ఘనంగా టిఎల్ఎం మేళా

**కొమురవెల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో బుధవారం ఎంఈవో రమేష్ అధ్యక్షతన మండల స్థాయి టిఎల్ఎం మేళా నిర్వహించారు. టిఎంఎల్ మేళాను డిఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి రాజమల్లయ్య, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, న్యాయనిర్ణేతలు, ఆఫీస్ ఎంఐఎస్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

### మధురానగర్‌లో ఘనంగా గణపతి హోమం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** పట్టణంలోని మధురానగర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుని మండపంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను కనుల పండుగగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గణనాథునికి ప్రత్యేక పూజలు, హోమంను ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు క్రాంతికుమార్, శ్రీకాంత్, అనిల్, నిఖిల్, సాయి, నాని, ప్రదీప్, కార్తిక్, రవి, ఎస్.వినయ్‌కుమార్, సాయితేజ, వినయ్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ గణపతి మండపంలో నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగగా నిర్వహిస్తున్నారు. బుధవారం 8వ రోజు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదిదేవుడు గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు రాజారాం, గణపతి విగ్రహ దాత వంగ మోహన్, నాయకులు ఏడెల్లి శ్రీనివాస్, ఆదిమూలం రవి, నాగేష్, వెంకటరెడ్డి, అత్తెల్లి రవి, కొమురవెల్లి రమేష్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### మట్టి గణపతిని పూజిస్తున్న నిర్వాహకులకు సన్మానం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో యువత గ్రామస్తుల ఆధ్వర్యంలో మట్టిగణపతిని ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న నిర్వాహకులను సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిని నర్సింలు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా దేశబోయిని నర్సింలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రసాయనాలు రంగులు లేని మట్టి గణపతులను పూజించి ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటిపల్లి కుమార్, తలారి కరుణాకర్, శ్రీరామ్ కనకరాజు, గుంటిపల్లి అఖిల్, తలారి శాంతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నాచగిరిలో వైభవంగా గణపతి హోమం

**వర్గల్, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి,సహాయ కమిషనర్ విజయరామారావు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులచే గణపతి హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.రవీందర్‌గుప్త దంపతులు, ధర్మకర్తలు సురేందర్‌రెడ్డి, చందా నాగరాజు దంపతులు, సంతోష్‌రావు, కొత్తపల్లి శ్రీనివాస్, గాలి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు. ఈనెల 4వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు గణేషుని నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి కోరారు.

### ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ నారాయణగౌడ్

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఎస్ఐ నారాయణగౌడ్ బుధవారం ఆవిష్కరించారు. ఫొటో, విడియోగ్రాఫర్ మండల అధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో ఎస్ఐ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 19,20,21న భాగ్యనగరంలో రాష్ట్రస్థాయిలో ఎక్స్ ప్రో కెమెరా కార్యక్రమం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపార. కార్యక్రమంలో ఆంజనేయులు, శేఖర్, నర్సింలు, ప్రభు, షాదుల్ల, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

### ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

**కొల్చారం,సెప్టెంబరు 3(ప్రభాతవార్త):** మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమావేశం మండలవిద్యాధికారి సత్యనారాయణరావు ఆధ్వర్యంలో కొల్చారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో జరిగే ఎండిఎం, ఎస్సీ ఎఫ్ఆర్ఎస్ ఎఫ్ఎల్ఎన్ వంటి కార్యక్రమాలు సజావుగా సాగేలా చూడాలన్నారు. సమావేశంలోనే ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రజల్లో ఉపాధ్యాయులు రేవతి, ఉపేందర్ రెడ్డి, రామేశ్వర్ ప్రసాద్, వెంకటరమణాచార్య, ఏజాజ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన కళా ఉత్సవ్ పోటీలు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3,ప్రభాతవార్త:** ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు అలరించాయి. బుధవారం మండల స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, క్లాసికల్,ఫోక్, బృంద,మిమిక్రి తదితర విభాల్లో మంచి ప్రదర్శన చేశారు. ధర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల గ్రూప్ పాటలలో హిమవర్షిని బృందం ప్రథమ స్థానం దక్కించుకుంది. బోమ్మల తయారిలో అరవింద్ జడ్పిహెచ్ఎస్ ధర్పల్లి, కథచెప్పడంలో చైతన్య తేజ ఆదర్శ పాఠశాల, మిమిక్రిలో జడ్పీహెచ్ఎస్ సూరారం రుక్మల్ అలీ, పెయింటింగ్‌లో ఆదర్శ పాఠశాల ఆర్తిచంద్ర విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈవో పుష్పవేణి అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వాణి కుమారిని అభినందించారు.



కళా ఉత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

## మంచినీటి సమస్యను పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు రమేష్‌గౌడ్

**మునిపల్లి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
హైద్రాపూర్ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం మండల నాయకులు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ హైద్రాపూర్ గ్రామంలో గత రెండు నెలలుగా బోర్లు చెడిపోవడంతో గ్రామంలోని ప్రజలకు మంచినీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శి అడిగిన పంచాయతీలో డబ్బులు లేవని నేను ఏమీ చేయలేనని అంటున్నారని గ్రామస్తులు అన్నారు. దీనితో బోర్లు బాగు చేయకపోవడంతో మంచినీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కనుక వెంటనే చెడిపోయిన బోర్లను బాగుచేసి గ్రామప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్, అంజయ్య, లక్ష్మణ్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి



రైతుల పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**కొండాపూర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని గోటిలగుట్ట తాండాలో పంట పొలాలను సందర్శిస్తూ ఆయన మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా కురిసిన భారీవర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఇలాంటి లాభసాటి లేని వ్యవసాయం చేస్తున్న రైతులు రుణాలు తీసుకుని పండించినటువంటి పంట చేతికి వచ్చే దశలో వర్షం కారణంగా సుమారు 30 ఎకరాలు పత్తి పంట పూర్తిగా నీట మునగడంతో ప్రకృతి రైతులను మరింత అప్పుల్లోకి నెట్టేసింది. అటువంటి రైతులను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏపంట ఎంత నష్టపోయారు అని రాతపూర్వకంగా రైతులనుగుర్తించి ఎకరాకు రూ.25వేలను వెంటనే వారికి అందిస్తూ భరోసాగా నిలబడాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు నాయకులు వెంకన్న, కిషన్, రైతులు రవి, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక బోధకులకు దరఖాస్తులు ఆహ్వానం

**పుల్‌కల్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లాలో ఎంపికచేసిన 59 ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక బోధకులు, ఆయాపోస్టులకు ఈ నెల 8వ తారీఖువరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ లేదా ప్రైమరీ టీచింగ్ అర్హత, ఆయాపోస్టులకు 7వ తరగతి అర్హత ఉండాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల వయసు 44సంవత్సరాలు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 9, 10వ తారీఖులలో పరిశీలించి 11వ తేదీన మండల ఎంపిక కమిటీ ద్వారా ఎంపిక చేసిన జాబితాను జిల్లా విద్యాధికారికి పంపాలన్నారు. ఎంపికైన బోధకులకు రూ.8వేలు, ఆయాపోస్టులకు రూ.6వేల గౌరవవేతనం అందించడం జరుగుతుందన్నారు. పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు ఏడాదిలో 10నెలల పాటు గౌరవ వేతనం అందుకుంటారన్నారు. ఆసక్తి, అర్హతగల వారు తమ దరఖాస్తులను మండలాల విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## బాలికల భవిష్యత్ రక్షణలో కీలకంగా చట్టాలు

-డిడబ్ల్యుఓ లలితకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డిడబ్ల్యుఓ లలితకుమారి

**జహీరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
బాలికలు, మహిళలు రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, వారి విద్య, భవిష్యత్తు కొరకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.లలితకుమారి అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో 10 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలోభాగంగా చట్టాలపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ పిఇపి ఎన్‌డిటి చట్టం లింగనిర్ధారణ నిషేధమని సూచిస్తుందని, చట్టాన్ని అమలయ్యేలా ఎవరికివారు తమవంతు చర్యలు తీసుకోవాలన్నారు. గృహహింస, పోక్సో చట్టాలు మహిళలకు, బాలికలకు రక్షణ కల్పిస్తాయన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన...**
మండల పరిధిలోని చిరాగ్‌పల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని డిడబ్ల్యుఓ లలితకుమారి సందర్శించి టీచర్లతో సమావేశం అయి పౌష్టికాహారపంపిణీ, గర్భిణీ స్త్రీల, బాలల ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సిడిపిఓ అంజమ్మ, మెడికల్ అధికారి సోయల్, జిల్లా సమన్వయకర్త పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిస్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం

**కంది, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఇంద్రకరణ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లామ్ టఫ్ కంపెనీ సౌజన్యంతో నూతన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ భవన సముదాయాన్ని మంగళవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా డిఇఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తు సాంకేతిక యుగం అని, విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లామ్ టఫ్ కంపెనీ యాజమాన్యం యూనిఫాంలను, బూట్లను, క్రీడా సామగ్రిని అందచేసి మొక్కలునాటారు. కార్యక్రమలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఠాకూర్ ఉదయ్‌సింగ్, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌కుమార్ మెహతా, కమలేష్ మెహతా, పారిశ్రామిక కేంద్ర మేనేజింగ్ డైరెక్టర్ తుల్జా నాయక్, మండల విద్యాధికారి జోగప్ప, డిసిఇబి ఇంచార్జి లింభాజీ, ఎంపిడిఓ శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, పంచాయతీ ప్రత్యేక అధికారి మహేందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం

-బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి
-మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి
-కానుకుంటలో వైకుంఠరథం అందజేత
-బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన

**గుమ్మడిదల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడు తమ వంతు సహకారం ఉంటుందని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో గ్రామప్రజల సౌకర్యార్థం కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తన సొంతనిధులతో వైకుంఠ రథాన్ని అందజేశారు. అలాగే మండలపార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి సొంతనిధులతో నూతన బస్‌స్టాప్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాట్లాడుతూ, ప్రజల అవసరాలు తీర్చడం, అభివృద్ధి పనులు చేయడం మా ప్రధానలక్ష్యం అని అన్నారు. వైకుంఠరథాన్ని అందజేయడం ద్వారా గ్రామప్రజలకు కష్ట సమయాల్లో అండగా నిలుస్తుంది అని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. కానుకుంట గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు తన సొంత నిధులతో నూతన బస్‌స్టాప్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని అన్నారు. ప్రజల అభివృద్ధికి అండగా ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, తుపాకుల



కొత్త బస్టాండ్ కోసం శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

రాజు, మంగయ్య ముద్రికచారి, క్యాతం బాల్రెడ్డి, చౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పద్మారెడ్డి, విశాల్‌గౌడ్, భార్గవ్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, మంగయ్య, గోపాల్, మహేష్, వెంకటేష్, కాంతారావు, యాదయ్య, సత్తయ్య, ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు, మహిళలు, యువత తదదిఇతరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడు అందోలులో రూ.31కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

-హాజరుకాన్ను మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
ఈ నెల 4న అందోలు నియోజకవర్గంలోని చౌటకూరు, అందోలు మండలాల్లో రూ.31కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ శంఖుస్థాపనలు చేయనున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో రూ.6.20కోట్లతో కెజిబివి భవనం, రూ.2.56కోట్లతో పిహెచ్‌సి భవనం, అందోల్‌లో 2కోట్లతో మున్సిపాలిటీ వెల్కమ్ ఆర్చ్, పాలిటెక్నిక్ కళాశాల వద్ద రూ.40లక్షలతో బస్‌షెల్టర్‌తోపాటు రూ.2.20కోట్లతో కెజిబివి భవనంలో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం, బాలికల గురుకుల పాఠశాలలో నిర్మించిన పేరెంట్స్ వెయిటింగ్ హాలు ప్రారంభోత్సవం, రూ.5.75కోట్లతో నిర్మించనున్న ఆర్డీవో కార్యాలయం, నివాసగృహాల నిర్మాణాలకు శంఖుస్థాపన, ఐడిఓసి కార్యాలయ నిర్మాణానికి శంఖుస్థాపన, రూ.2కోట్లతో స్వామి వివేకానంద పార్క్‌లో సుందరీకరణ పనులకు శంఖుస్థాపన, జోగిపేటలో రూ.7.23కోట్లతో వ్యవసాయమార్కెట్‌లో కాంపౌండ్‌వాల్,షాపింగ్‌కాంప్లెక్స్, రైతు వెయిటింగ్‌హాలు, ఇతరపనులకు శంఖుస్థాపన, రూ.2.45కోట్లతో నేరెడిగుంటలో పిహెచ్‌సి భవననిర్మాణానికి, ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేస్తారని, ఈకార్యక్రమాలకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## నేటితరానికి సావిత్రిబాయి పూలే ఆశయాలు మార్గదర్శం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నిర్మలజగ్గారెడ్డి, జెసి మాధురి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
సావిత్రిబాయి పూలే ఆశయాలు నేటి తరం, ఆదర్శంగా తీసుకోవాలని టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వాసవి మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయిపూలే విగ్రహాన్ని బుధవారం టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి, సంగారెడ్డి అదనపుకలెక్టర్ మాధురీతోకలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను అభినందించారు. మాతల్లిదండ్రులు పద్మావతి, ఈశ్వరయ్య జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు వాసవి మా ఇల్లు సంస్థ వ్యవస్థాపకులు తోపాజి అనంతకిషన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ అధికారి గోవిందారం, వాసవి మా ఇల్లు సంస్థ కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, సహ కార్యదర్శి తోపాజి హరీష్, యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, ఆర్యవైశ్యసంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వాసవి మహాసంస్థాన్ కోశాధికారి జూలకంటి మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడం రాధాకిషన్, జూలకంటి బుచ్చిలింగం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, సంఘం అధ్యక్షుడు కళింగ కృష్ణకుమార్, భారతీయ విద్యా మందిరం పాఠశాల అధినేత లింగాగౌడ్, కళాశాల ప్రిన్సిపల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

## పత్తిలో రసం పీల్చేపురుగు ఉధృతి

-రైతు విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

**జోగిపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
పత్తిపంటలో రసం పీల్చేపురుగు నివారణకు ఫ్లోనికామిడ్ అనే మందును 0.4గ్రాములను లీటర్ నీటిలోకలిపి పిచికారి చేయాలని సంగుపేట రైతు విజ్ఞానకేంద్రంశాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో వరి, పత్తి, కంది పంటలను రైతు విజ్ఞానకేంద్రం బృందం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చేపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. దీనినివారణకు అవసరమైన చర్యలను రైతులకు వివరించారు. కంది, శనగ పంటలో ఎరువుల యాజమాన్యం, పచ్చపురుగు నివారణచర్యలను వివరించారు. ఈకార్యక్రమంలో యంగ్‌ప్రొఫెషనల్ శ్రీకాంత్,ఆకాశ్,గ్రామరైతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

-సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
సంగారెడ్డి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కలసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. నియోజవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మొత్తం 20సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, అక్బర్ తదితరులు ఉన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్ చంద్రశేఖర్

**జహీరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో ప్రవహిస్తున్న నారింజ ప్రాజెక్టులో కొనసాగే వినాయక నిమజ్జన కార్యక్రమాలను పురస్కరించుకుని కొనసాగుతున్న ఏర్పాట్లలను బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. జహీరాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అదనపు కలెక్టర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని ఆయాశాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.సుభాష్‌రావు, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణరావు

**కొల్చారం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
కొల్చారం మండలపరిధిలోని అన్నిపాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం మండలవిద్యాధికారి సత్యనారాయణరావు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొల్చారంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించడం జరిగింది. సమావేశంలోనే స్వచ్ఛ్ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్‌పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేవతి, ఉపేందర్‌రెడ్డి, రామేశ్వర్‌ప్రసాద్, వెంకటరమణాచార్య, ఏజాజ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో



జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

**కొల్చారం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోయిన రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం మెదక్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై బయట నుంచి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారి పునర్నిర్మాణంలో భాగంగా ప్రాథమిక పాఠశాల మూలమలుపు సరిచేస్తూ రహదారి నిర్మించడానికి తాము భూములు ఇచ్చామని భూమికి బదులు పాత రోడ్డును సాగుకు ఇస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో రైతులు బుధవారం మెదక్ హైదరాబాద్ రహదారి అప్పాజీపల్లి వద్ద నిరసన చేపట్టామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి భూములు కోల్పోయిన రైతులను న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సంవత్సరాలు గడుస్తున్నా తమను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సంఘటన స్థలానికి కొల్చారం మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మహమ్మద్ మోహినుద్దీన్ చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు.

## పాఠశాలకు బీరువాను అందించిన పూర్వ విద్యార్థులు

**పుల్‌కల్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ముద్దామాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అందుకున్న పూర్వవిద్యార్థులు బుధవారం పాఠశాలకు బీరువా అందచేశారు. పాఠశాలలో 1997-98 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతుగా పాఠశాలకు బీరువాను కొనుగోలుచేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బీరువా తాళాలను అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్వ విద్యార్థుల సేవానిరతిని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు డి.మాణిక్యం, ఎండి రైముద్దీన్, పి.మాధవరెడ్డి, వై.అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసి 69వ వారోత్సవాలు

-విద్యార్థులకు పోటీలు-బహుమతులు
-ఎల్ఐజి మేనేజర్ శ్రీనివాసరాజు



విద్యార్థులకు బహుమతులందిస్తున్న ఎల్ఐసి మేనేజర్ శ్రీనివాసరాజు

**జహీరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
భారతీయ జీవిత బీమా సంస్థ 69వ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లోభాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎల్ఐజి జహీరాబాద్ బ్రాంచి మేనేజర్ పి.శ్రీనివాసరాజు, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌రావు, లియాఫి అధ్యక్షులు ఈడిగ విఠల్ గౌడ్‌లు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి జహీరాబాద్‌శాఖ మేనేజర్ పి.శ్రీనివాసరాజు, అసిస్టెంట్‌మేనేజర్ జె.సుధాకర్ రావు, ఎల్ఐసి సిబ్బంది యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్, విజయ భాస్కర్, బి.అశోక్, ఎల్ఐసి లియాఫీ యూనియన్ అధ్యక్షులు ఈడిగ విఠల్‌గౌడ్, ఏజెంట్లు తలారి నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, ఉపాధ్యాయులు విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో ఫోటో ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ



ఫోటో ఎక్స్పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మల్లయ్య

**అల్లాదుర్గం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
ఈ నెల 19,20,21వ తారీఖులలో హైద్రాబాద్‌లో నిర్వహించే ఫోటో ఎక్స్పో కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని రెవిన్యూ కార్యాలయంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లయ్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు పాపయ్య, బసవరాజ్, రవి, డేవిడ్, వీరు, అంజి, నాగరాజు, గప్పార్, పార్థ పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమపథకాలు

-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమపథకాలు అందిస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండలపరిధిలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద మంజూరైన 39మంది, ముఖ్యమంత్రి సహాయనిధి పథకం క్రింద 20మంది లబ్ధిదారులకు బుధవారం చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో షాకీర్ అలీ, కాంగ్రెస్ నాయకులు రాయిని మధుసూదన్, నారా గౌడ్, ఆర్యన్ సంతోష్ కుమార్, రాజేందర్‌గౌడ్, దాచా సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, రాజు, పెరుమాళ్‌గౌడ్, కుంట్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులుతీరిన రైతులు

-ఒక్కో బస్తాపై 40రూపాయలు అదనంగా వసూలు



చౌటకూరులో యూరియా కొరకు బారులుతీరిన రైతులు

**చౌటకూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులో యూరియాబస్తాల కొరకు బుధవారం రైతులు బారులుతీరారు. డిసిఎంఎస్ ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రానికి 400 యూరియాబస్తాలు, వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణానికి 229 యూరియాబస్తాలు సరఫరా కాగా, రైతులు యూరియాబస్తాల కొరకు బారులుతీరారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం చూపించిన రైతులకు రెండు యూరియాబస్తాల చొప్పున అందచేస్తూ వస్తున్నారు. రెండుబస్తాల యూరియాను అందుకునేందుకు గంటల తరబడి లైన్‌లో వేచి ఉండాల్సిన దయనీయ దుస్థితి దాపురించిందని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. లైన్‌లో గంటలతరబడి వేచి ఉండటంతో ఇబ్బందులు పడుతున్న రైతులపై పుండుమీద కారంచల్లిన చందంగా యూరియాబస్తాకు 266.50 రూపాయలు తీసుకోవాల్సి ఉండగా 300 రూపాయలను రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. బహిరంగంగా అధిక ధరలు తీసుకుంటున్నా, వ్యవసాయ అధికారులు కాని, పోలీసు అధికారులు కాని తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రవీణ మాట్లాడుతూ మండలానికి అవసరమైన యూరియాబస్తాలను తెప్పించి రైతులకు అందచేయడం జరిగిందని, రైతులు అదనపు యూరియాబస్తాల కొరకు వస్తున్నారని పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన కోటా పూర్తయిందని, డిమాండ్‌ను అనుసరించి యూరియాబస్తాల లోడ్‌ను తెప్పిస్తామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరంలేదని సూచించారు.

## గణేశుడిని దర్శించుకున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతినగర్, శ్రీనివాస్ నగర్ కాలనీల్లో కొలువున్న వినాయకులను బుధవారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.